# చిన్నారిని అపహరించిన కేసులో ఒకరికి ఏడాది జైలు

శక్కర్‌నగర్, జూన్ 13: బోధన్ పట్టణంలోని నాదెల్లి మసీదు వద్ద తల్లితోపాటు పడుకుని ఉన్న పదినెలల పసిపాపను అపహరించిన కేసులో ఓ మహిళకు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ బోధన్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దేవన్ అజయ్ కుమార్ గురువారం తీర్పు చెప్పారు. లైజనింగ్ అధికారి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మేకల లక్ష్మి అనే మహిళకు ముగ్గురు పాపలు కాగా, భర్తతో విభేదాల కారణంగా తన పుట్టిల్లు చిన్న మావందిలో నివాసం ఉండేది. పదినెలల పాప ఆరోగ్యం సరిగా లేని కారణంగా 7 నవంబర్, 2022న బోధన్‌లోని జిల్లా ప్రభుత్వ దవాఖానలో చికిత్స కోసం చేర్పించింది. రెండు రోజుల అనంతరం 9న సాయంత్రం కల్లు సేవించిన మేకల లక్ష్మి, తన చిన్నారితో కలిసి దవాఖాన సమీపంలోని నాదెల్లి మసీదు సమీపంలో పడుకున్నది. 10న ఉదయం చూసే సరికి తన పాప కనిపించకపోవడంతో, భర్తపై అనుమానంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ బీడీ ప్రేమ్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఎస్సై నవీన్ విచారణ చేపట్టారు. ఈ ఘటనలో చిన్నకుంట్ల గంగామణితోపాటు అంజలి, షమీమ్ బేగం, షహనాజ్ పర్వీన్ కలిసి చిన్నారిని అపహరించినట్లు గుర్తించారు. ఈ కేసులో గురువారం పోలీసుల తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ పల్నాటి సమ్మయ్య వాదించారు. చిన్నకుంట్ల గంగామణి చిన్నారిని అపహరించినట్లు సాక్ష్యాధారాలతో నిరూపణ కావడంతో.. ఆమెకు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.100 జరిమానా చెల్లించాలని తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 15 రోజులపాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయమూర్తి తీర్పులో వెల్లడించారు. ఈ కేసులో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, పట్టణ సీఐ సంద్ర వీరయ్య న్యాయస్థానానికి ఆధారాలు అందజేశారు. లైజనింగ్ అధికారిగా శంకర్, కోర్టు కానిస్టేబుళ్లు లక్ష్మణ్, గణేశ్ ఈ కేసుకు సంబంధించి విధులు నిర్వహించారు.

# ముదిరాజ్ కులస్తులకు వృత్తినైపుణ్యా పరీక్షలు



వృత్తి నైపుణ్యా శిక్షణకు హాజరైన ముదిరాజ్ కులస్తులు

లింగంపేట, జూన్ 13: మండలంలోని మెంగారం గ్రామంలో ముదిరాజ్ సంఘ సభ్యులకు గురువారం వృత్తి నైపుణ్యా పరీక్షలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ముదిరాజ్‌లకు చేపల వేట కోసం వల విసరడం, పాండ్రి లాగడం, ఈత కొట్టడం తదితర పరీక్షలు నిర్వహించామని జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి తెలిపారు. మొత్తం 37 మంది సభ్యులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం ఆడిటర్ శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు విఠల్, ఉపాధ్యక్షుడు రాజు, మండల శాఖ అధ్యక్షుడు దాసిర సాయిలు, గౌరవ అధ్యక్షుడు బొల్లారం సాయిలు, లింగంపేట పట్టణ అధ్యక్షుడు రాజారాం బాలయ్య, సభ్యులు దూర్శెట్టి అశోక్, సాయి కిరణ్, జిల్లా మత్స్య శాఖ సిబ్బంది శ్వేతా సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి, జూన్ 13: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులను ఆబ్జెక్టివ్ టైప్, ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు కుటుంబ వార్షిక ఆదాయం రూ.3లక్షలు మించరాదని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులను ఈ నెల 30లోగా http:studycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు http://twd.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని, 6281766534 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## పెందోట సాహితీ పురస్కారానికి 'జైవిజ్ఞాన్' ఎంపిక




సుభాష్‌నగర్, జూన్ 13: జిల్లాకు చెందిన ప్రముఖ కవి, బాలసాహిత్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు రచించిన 'జై విజ్ఞాన్' పుస్తకం సిద్దిపేట పెందోట సాహితీ పురస్కారినికి ఎంపికైంది. ఈ మేరకు ఆ సంస్థ అధ్యక్షుడు పెందోట వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారం కోసం ఉభయ రాష్ట్రాల నుంచి 80 పుస్తకాలు రాగా.. 'కాసర్ల' రచన ఎంపికైనట్లు పేర్కొన్నారు. బడి పిల్లల కోసం కాసర్ల రాసిన జై విజ్ఞాన్ పుస్తకంలో మొత్తం 10 నాటికలు ఉన్నాయి. పెందోట పురస్కారానికి జై విజ్ఞాన్ ఎంపిక కావడంపై ఉమ్మడి జిల్లా సాహితీవేత్తలు కాసర్లను అభినందించారు.

## ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షా ఫలితాలు విడుదల

ఖలీల్‌వాడి, జూన్ 13: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాలు గురువారం విడుదలైనట్లు డీఈవో దుర్గా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో జిల్లా ఆరో స్థానం, ఇంటర్‌లో ఎనిమిదో స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షకు 1592 మంది హాజరు కాగా.. 1310 మంది, ఇంటర్ 1,699 మంది పరీక్ష రాయగా.. 1100మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.



# పోచారం ప్రాజెక్టుపై.. సైడ్‌గ్రిల్స్


- కేసీఆర్ హయాంలో రూ.34లక్షల నిధులు మంజూరు
- పనులు పూర్తవ్వడంతో పర్యాటకుల హర్షం

నాగిరెడ్డిపేట, జూన్ 13 : సహజ సిద్ధంగా పొంగిపొర్లే రాష్ట్రంలోని ఏకైక ప్రాజెక్టు పోచారం. వానకాలంలో రెండు గుట్టల మధ్యన ఉన్న ప్రాజెక్టుపై నుంచి నీరు పొంగిపొర్లిందటే.. ఆ సుందర దృశ్యాన్ని చూసేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులతో కిక్కిరిసిపోతుంది. చూపరులకు కనువిందు చేస్తుంది. ఇంత అందమైన ప్రాజెక్టు గత పాలకుల నిర్లక్ష్యంతో గడిచిన వందేండ్లలో పర్యాటకుల రక్షణ కోసం ఒక్కరూపాయి వెచ్చించలేదు. అంతటి దీనస్థితిలో ఉన్న ప్రాజెక్టును సందర్శించిన కేసీఆర్ ప్రభుత్వంలోని అప్పటి మంత్రి తన్నీరు హరీశ్‌రావు రక్షణ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ప్రాజెక్టుపై పర్యాటకుల రక్షణ కోసం చుట్టూ రేలింగ్, ప్రాజెక్టు ప్రధాన కాలువ గేట్లు వందేండ్ల క్రితానికి చెందినవి కావడంతో వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు రూ.34లక్షలను మంజూరు చేశారు. ఆ నిధులతో పనులు ప్రారంభించిన అధికారులు ఇటీవల పనులు పూర్తి చేశారు. దీంతో స్థానికులు, పర్యాటకులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. వందేండ్లలో ఎవరూ గుర్తించని సమస్యను పరిష్కరించిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.



కొత్తగా ఏర్పాటు చేసిన ప్రాజెక్టు ప్రధానకాలువ గేట్లు

### రూ.34లక్షలతో పనులు పూర్తిచేశాం



గతేడాది ప్రాజెక్టును అప్పటి మంత్రి హరీశ్ రావు సందర్శించారు. ప్రాజెక్టుపై ఉన్న ఇబ్బందులు గుర్తించి ప్రాజెక్టుకు ఇరుపక్కల, మెట్లపై స్టీల్ రేలింగ్ కోసం రూ.9లక్షలు, ప్రధాన కాలువ కొత్త గేట్లకు రూ.25 లక్షల నిధులను మంజూరు చేశారు. వాటితో పనులను పూర్తి చేయించాం.

**- వెంకటేశ్వర్లు, నీటి పారుదల శాఖ డీఈఈ.**

### రేలింగ్ ఏర్పాటుతో ప్రాజెక్టుకు అందం వచ్చింది



స్టీల్ రేలింగ్ ఏర్పాటుతో ప్రాజెక్టుకు అందం వచ్చింది. ప్రాజెక్టు మెట్లపై నుంచి కిందికి వస్తుంటే భయంగా ఉండేది. ఇప్పుడు మెట్లకు ఇరువైపులా రేలింగ్ ఏర్పాటు చేయడంతో ప్రమాద భయం లేదు. పర్యాటకుల కోసం తాగునీరు, మూత్రశాలలు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలి.

**- యాదగిరిగౌడ్, గోలిలింగాల**

### ప్రాజెక్టుపై వెళ్తుంటే సంతోషంగా ఉన్నది..



పోచారం ప్రాజెక్టుపై ఇరువైపులా రక్షణగా స్టీల్ రేలింగ్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉన్నది. గతంలో ప్రాజెక్టుపై నవడాలంటే..భయం వేసేది. ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడేవారు. ప్రాజెక్టు నిర్మించి వందేండ్లు దాటిపోయింది. ఇప్పటి వరకు ఎన్నిసార్లు ప్రాజెక్టుపై రక్షణ కల్పించాలని కోరినా ఎవరూ పట్టించుకోలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయడం సంతోషంగా ఉన్నది. నిధులు మంజూరు చేసిన మాజీ మంత్రి హరీశ్‌రావు గారికి మా ఊరి తరఫున కృతజ్ఞతలు.

## నేడు జాబ్ మేళా

కామారెడ్డి, జూన్ 13 : జిల్లాలో సాఫ్ట్‌వేర్ రంగం హెచ్‌సీఎల్ టెక్ వారు నిర్వహిస్తున్న టెక్ బీ ప్రోగ్రాం కోసం సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ గ్రూప్‌లతో 2024లో ఇంటర్మీడియేట్ పూర్తిచేసుకున్న విద్యార్థులకు శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియేట్ నోడల్ అధికారి షేక్ సలాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ రంగ, ప్రైవేట్ కళాశాలల్లో 2024లో పూర్తి చేసుకున్న హెచ్ఈసీ, సీఈసీ, ఒకేషనల్‌లో 75 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని తెలిపారు. పదోతరగతి పాస్ సర్టిఫికెట్, ఇంటర్మీడియేట్ పాస్ ఆన్‌లైన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఒక ఫొటో, ఆండ్రాయిడ్ మొబైల్‌తో డ్రైవ్ స్థలానికి హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8074065803 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## బిగ్‘సి’లో గెలాక్సీ ఏఐ సూపర్ సేల్




హైదరాబాద్, జూన్ 13: ప్రముఖ రిటైల్ మొబైల్ విక్రయ సంస్థ బిగ్‘సి’ షోరూంలో సామ్‌సంగ్‌నకు చెందిన గెలాక్సీ ఏఐ సిరీస్ ఫోన్లు ఈ నెల 14 నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా బిగ్‘సి’ ఫౌండర్, సీఎండీ బాలు చౌదరి మాట్లాడుతూ..సామ్‌సంగ్ గెలాక్సీ ఏఐ సిరీస్ ఫోన్లను సూపర్ సేల్‌లో భాగంగా శుక్రవారం నుంచి అన్ని రిటైల్ స్టోర్లలు అందుబాటులోకి తేనున్నట్లు, అత్యంత అధునాతనమైన ఫీచర్లతో రూపొందించిన ఈ మొబైల్ ప్రారంభ ధర రూ.39,999గా ఉందని చెప్పారు. ఈ మొబైల్‌ను కొనుగోలు చేసిన వారికి జీరో డౌన్ పేమెంట్, 24 నెలల్లో నో కాస్ట్ ఈఎంఐ సదుపాయాలు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే మొబైల్ కొనుగోలుపై రూ.16 వేల వరకు ఇన్‌స్టంట్ క్యాష్ బ్యాక్, రూ.18 వేల వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ వంటి ఆకర్షణీయమైన ఆఫర్లు లభిస్తాయని వివరించారు.

### పంచ్, నెక్సాన్ ఈవీలు సురక్షితమైనవి..

న్యూఢిల్లీ, జూన్ 13: దేశీయ ఆటో మొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్‌కు చెందిన పంచ్.ఈవీ, నెక్సాన్.ఈవీలకు భారత్ న్యూ కార్ అసెస్మెంట్ ప్రోగ్రాం(భారత్-ఎన్‌సీఏపీ) 5 స్టార్ రేటింగ్ ఇచ్చింది. దేశీయ ఎలక్ట్రిక్ వాహన విభాగంలో ఈ రెండు కార్లు అత్యంత సురక్షితమైనవని, అందుకోసం టాటా మోటర్స్‌ను అభినందిస్తున్నానని ఎక్స్‌లో కేంద్ర రోడ్డు, రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.

### సువెన్ చేతికి సపలా

హైదరాబాద్, జూన్ 13: సువెన్ ఫార్మాస్యూటికల్స్..సపలా ఆర్గానిక్స్‌లో 67.5 శాతం వాటాను కొనుగోలు చేయబోతున్నది. ఒప్పందం విలువ రూ. 229 కోట్లు. ఈ సందర్భంగా సపలా ఫౌండర్ ఎల్లారెడ్డి మాట్లాడుతూ.. వ్యూహాత్మక వ్యాపార భాగస్వామి సువెన్‌తో కలిసి మరింతగా విస్తరించనున్నట్లు, భవిష్యత్తు వృద్ధికి ఈ వాటా విక్రయం తోడ్పాటునందించనున్నదన్నారు.

### డాలర్ ప్రచారకర్తగా మహేశ్ బాబు


హైదరాబాద్, జూన్ 13: ప్రముఖ దుస్తుల సంస్థ డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తాజాగా తెలుగు నటుడు మహేశ్ బాబును ప్రచారకర్తగా నియమించుకున్నది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ వినోద్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాల్లో విక్రయాలు 50 శాతం వృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నట్లు, ఇందుకోసం 50 ఔట్‌లెట్లను ప్రారంభించబోతున్నట్లు ఆయన ప్రకటించారు.

### ఎఫ్‌టీసీసీఐ అవార్డులకు దరఖాస్తులు

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ఎఫ్‌టీసీసీఐ వార్షిక ఎక్సలెన్స్ అవార్డుల కోసం అర్హులైన పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఆన్‌లైన్ ద్వారా ఎఫ్‌టీసీసీఐకి నామినేషన్లు పంపించేందుకు ఈ నెల 20 చివరి గడువు అని ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షులు మేలా జయదేవ్ తెలిపారు. ఎగుమతులు, మార్కెటింగ్, నూతన ఆవిష్కరణలు, ఆర్ అండ్ డీ టెక్నాలజీ తదితర 21 విభాగాల్లో విజేతలను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.

## పేటీఎంతో సామ్‌సంగ్ దోస్తీ

***గెలాక్సీ స్మార్ట్‌ఫోన్ యూజర్లకు ట్రావెల్, ఎంటర్‌టైన్‌మెంట్ సర్వీసులు***




న్యూఢిల్లీ, జూన్ 13: డిజిటల్ పేమెంట్స్ యాప్ పేటీఎంతో సామ్‌సంగ్ జట్టు కట్టింది. దేశీయంగా తమ సామ్‌సంగ్ వాలెట్‌కు ట్రావెల్, ఎంటర్‌టైన్‌మెంట్ సర్వీసులను జత చేసేలా పేటీఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌తో భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నది. పేటీఎం సహకారంతో ఇక సామ్‌సంగ్ గెలాక్సీ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు సామ్‌సంగ్ వాలెట్ ద్వారా విమాన, బస్ టికెట్ల బుకింగ్, సినిమా టికెట్ కొనుగోళ్లు, ఈవెంట్ బుకింగ్స్ చేసుకోవచ్చు. గెలాక్సీ స్టోర్ నుంచి ప్రస్తుత సామ్‌సంగ్ వాలెట్ యూజర్లు తమ యాప్‌ను అప్‌డేట్ చేసుకోవడం ద్వారా ఈ కొత్త సర్వీసులను అందుకోవచ్చు.

వాణిజ్య

# అంబుజా చేతికి పెన్నా

- మరో సంస్థను హస్తగతం చేసుకున్న అదానీ గ్రూప్
- లావాదేవీ విలువ రూ.10,422 కోట్లు
- సిమెంట్ ఇండస్ట్రీ ఆధిపత్యంపై గౌతమ్ అదానీ కన్ను
- కంపెనీల కొనుగోలుకు రూ.25,000 కోట్లతో నిధి






హైదరాబాద్, జూన్ 13: గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్.. మరో సంస్థను హస్తగతం చేసుకున్నది. అదానీ గ్రూప్‌నకు చెందిన అంబుజా సిమెంట్ గురువారం పెన్నా సిమెంట్‌ను పూర్తిగా కొనేసింది. కంపెనీ విలువను రూ.10,422 కోట్లుగా లెక్కగట్టి ఈ లావాదేవీని జరిపింది. ఈ మేరకు అంబుజా సిమెంట్ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)కు తెలియజేసింది. నగదు రూపంలోనే డీల్ ఉన్నట్టు తెలుస్తున్నది. కాగా, పెన్నా సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (పీసీఐఎల్)తో బైండింగ్ అగ్రిమెంట్‌పై సంతకాలు జరిగాయని చెప్పింది. దీంతో పీసీఐఎల్ 100 శాతం వాటాలు దాని ప్రస్తుత ప్రమోటర్ గ్రూప్, పీ ప్రతాప్ రెడ్డి, ఆయన కుటుంబం నుంచి అంబుజా చేతికి రానున్నాయి. ఇక ఈ డీల్‌తో పెన్నా డీలర్లంతా అంబుజా సిమెంట్ మార్కెట్ నెట్‌వర్క్‌లోకి వస్తున్నారు.

**దక్షిణాదిపై పట్టు**

పెన్నా సిమెంట్ కొనుగోలుతో అదానీ గ్రూప్ దక్షిణాది మార్కెట్ షేర్ మరో 8 శాతం పెరిగింది. ఇప్పటికే అంబుజా, ఏసీసీ సిమెంట్లతో దేశవ్యాప్తంగా సిమెంట్ ఇండస్ట్రీలో బలమైన కార్పొరేట్ శక్తిగా గౌతమ్ అదానీ ఎదిగారు. అయినప్పటికీ భారత్‌లో అల్ట్రాటెక్ తర్వాతి స్థానంలోనే ఉండిపోయారు. ఈ క్రమంలో పెన్నా సిమెంట్ డీల్.. దేశీయ సిమెంట్ పరిశ్రమలో అదానీ వాటాను ఇంకో 2 శాతం పెంచింది. నిజానికి భారతీయ సిమెంట్ ఇండస్ట్రీలో అగ్రస్థానంపైనే అదానీ కన్నేశారు. ఇందు కోసం 3 బిలియన్ డాలర్ల (రూ.25,000 కోట్లు)తో ఓ నిధిని కూడా పక్కకు పెట్టుకున్నారు. ఇక పీసీఐఎల్‌కు వ్యూహాత్మక ప్రాంతాల్లోనే ప్లాంట్లున్నాయి. దీనికి కావాల్సినంత సున్నపురాయి నిల్వలూ ఉన్నాయి. ఫలితంగా డిమాండ్‌కు తగ్గ సిమెంట్‌ను ఉత్పత్తి చేయడానికి పుష్కలంగా అవకాశాలున్నాయని అదానీ గ్రూప్ చెప్తున్నది.

**సిమెంట్ గిరాకీకి తగ్గట్టుగా..**

భారతీయ సిమెంట్ పరిశ్రమ వేగంగా వృద్ధి చెందుతున్నది. ఈ నేపథ్యంలోనే రాబోయే ఐదేండ్లకుపైగా కాలంలో వార్షిక చక్రవృద్ధి రేటు (సీఏజీఆర్) 7 నుంచి 8 శాతంగా ఉండొచ్చని అదానీ గ్రూప్ అంచనా వేస్తున్నది. దేశవ్యాప్తంగా రైల్వే సైడింగ్స్, క్యాపిటివ్ పవర్ ప్లాంట్లు, వేస్ట్ హీట్ రికవరీ సిస్టమ్స్‌తోపాటు సాగునీటి ప్రాజెక్టులు, నివాస సముదాయాలు, రహదారుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దీనికి తగ్గట్టుగానే చిన్న, పెద్ద సిమెంట్ కంపెనీలను చేజిక్కించుకోవాలని అదానీ గ్రూప్ ప్రయత్నిస్తున్నది. తద్వారా మార్కెట్‌లోనూ ఆధిపత్యం కొనసాగించాలనుకుంటున్నది. అంబుజా, ఏసీసీ, సంఘీ ఇండస్ట్రీస్‌ల వార్షిక ఉత్పాదక సామర్థ్యం ఇప్పుడు 78.9 మిలియన్ టన్నులుగా ఉన్నది. దేశవ్యాప్తంగా వీటికి 18 ప్లాంట్లు, 19 గ్రైండింగ్ యూనిట్లున్నాయి. తాజాగా పెన్నా సిమెంట్‌నూ పొందడంతో మొత్తం అదానీ గ్రూప్ ఆధ్వర్యంలోని సిమెంట్ సంస్థల వార్షిక ఉత్పాదక సామర్థ్యం 89 మిలియన్ టన్నులకు చేరుతున్నది. అలాగే కోల్‌కతా, గోపాల్‌పూర్, కరైకల్, కొచ్చి, కొలంబోల్లోని బల్క్ సిమెంట్ టెర్మినల్స్‌తో అదానీ సిమెంట్ సముద్ర రవాణా సామర్థ్యం బలపడింది.

- **1991లో పెన్నా సిమెంట్‌ను స్థాపించారు.**
- **1994 ఆగస్టు 10న అనంతపురం జిల్లా తలారిచెరువు వద్ద తొలి ప్లాంట్ ఏర్పాటు.**
- **ఏపీ, తెలంగాణ, రాజస్థాన్లలో ప్లాంట్లు.**
- **ఈ కంపెనీకి 3 ప్యాకేజింగ్ టర్మినళ్లు, 2 గ్రైండింగ్ యూనిట్లు, 4 ఇంటిగ్రేటెడ్ ప్లాంట్లున్నాయి.**
- **ప్రస్తుత వార్షిక ఉత్పాదక సామర్థ్యం 10 మిలియన్ టన్నులు.**
- **కృష్ణపట్నం, జోధ్‌పూర్లలో 2 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో 2 ప్లాంట్లు రాబోతున్నాయి. మరో 6-12 నెలల్లో వీటి నిర్మాణం పూర్తవుతుంది. అప్పుడు సంస్థ వార్షిక సిమెంట్ ఉత్పాదక సామర్థ్యం 14 మిలియన్ టన్నులకు చేరుతుంది.**
- **'పెన్నా సురక్ష' పేరిట ఆసియాలోనే అతి పెద్ద సెల్ఫ్ డిశ్చార్జ్ సిమెంట్ రవాణా నౌక పెన్నా సిమెంట్‌కు ఉన్నది. ఇది 25వేల మిలియన్ టన్నుల సిమెంట్‌ను తీసుకెళ్లగలదు. డిశ్చార్జ్ కెపాసిటీ గంటకు వెయ్యి టన్నులు.**
- **పెన్నా సిమెంట్‌తో అదానీ గ్రూప్ శ్రీలంక మార్కెట్లోకీ ప్రవేశిస్తున్నది. అక్కడ పెన్నా ఓ సిమెంట్ ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నది.**

> అంబుజా సిమెంట్ వృద్ధిదాయక ప్రయాణంలో పెన్నా సిమెంట్ కొనుగోలు కీలక మైలురాయి. ఈ డీల్‌తో దేశంలో మా సిమెంట్ వ్యాపారం మరింత విస్తరించడమేగాక, బలపడినట్టైంది. విలువ, ఉత్పత్తిపరంగా పీసీఐఎల్‌ను అత్యంత పోటీయుత సంస్థగా తీర్చిదిద్ది, దాని పనితీరును మెరుగుపర్చడమే మా లక్ష్యం.
>
> ***-అజయ్ కపూర్, అంబుజా సిమెంట్ సీఈవో***

## మైక్రోసాఫ్ట్-బీవోబీ జనరేటివ్ ఏఐ హ్యాకథాన్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్, ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) ఆధ్వర్యంలో ఆన్‌లైన్ హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నది. బ్యాంకింగ్ రంగంలో నిర్దిష్ట వ్యాపార రంగాల కొరకు జనరేటివ్ ఏఐ సాంకేతికతను ఉపయోగించి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయటమే లక్ష్యంగా హ్యాకథాన్ ఏర్పాటు చేస్తున్నది. ఉత్తమ ఆలోచనలతో వచ్చిన విద్యార్థులు, డెవలపర్లు, వృత్తి నిపుణులు, స్టార్టప్ సంస్థలకు పారితోషికాన్ని అందించనుంది. ఉత్తమమైన మూడు ఆలోచనలను ఎంపిక చేసి తొలి, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ. 2 లక్షలను బీవోబీ అందించనున్నది. ఈ నెల 27 వరకు ఔత్సాహికులు దరఖాస్తు చేసుకునేందుకు https://bobhackathon.com సందర్శించి పూర్తి వివరాలను తెలుసుకోవచ్చన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న బ్యాంకింగ్ రంగానికి టెక్నాలజీ అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నదని బీవోబీ ఈడీ సంజయ్ ముదలియార్ అన్నారు. అందుబాటులోకి వస్తున్న నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో బీవోబీ ముందు వరుసలో ఉంటున్నదని, ఏఐ, జనరేటివ్ ఏఐతో బ్యాంకింగ్ రంగంలో సమూలమైన మార్పు లు రాబోతున్నట్లుగా స్పష్టం చేశారు.

## ఈనెల 22న జీఎస్టీ కౌన్సిల్ భేటీ


న్యూఢిల్లీ, జూన్ 13: ఈ నెల 22న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ సమావేశం కాబోతున్నది. 53వ సారి జరుగుతున్న ఈ సమావేశం నరేంద్ర మోదీ సర్కార్ మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత జరుగుతున్న తొలి సమావేశం కావడం మరింత ప్రాధాన్యత సంతరించుకున్నది. ప్రధానంగా ఈ సమావేశంలో ఆన్‌లైన్ గేమింగ్‌పై జీఎస్టీ విధింపుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నది.

### రికార్డుస్థాయికి సూచీలు

ముంబై, జూన్ 13: దేశీయ స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. ధరల సూచీ తగ్గుముఖం పట్టడంతో వచ్చే సమీక్షలోనే రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటంతో మదుపరుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. దీంతో కొనుగోళ్లకు మద్దతు పలకడంతో దేశీయ సూచీలు మరో చారిత్రక గరిష్ఠ స్థాయిని తాకాయి. ఒక దశలో 77,145 పాయింట్లను తచ్చాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 204.33 పాయింట్ల లాభంతో 76,810.90 వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ కూడా 75.95 పాయింట్లు అందుకొని 23,398.90 వద్ద నిలిచింది. ఇరు సూచీలకు ఇదే గరిష్ఠ స్థాయి ముగింపు కావడం విశేషం. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.431.67 లక్షల కోట్లకు చేరుకున్నది.

## పన్ను రేట్లు తగ్గాలి

**అప్పుడే దేశాభివృద్ధి సాధ్యం: నిపుణులు**




న్యూఢిల్లీ, జూన్ 13: భారత్ 2047 కల్లా అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా అవతరించాలంటే పన్నుల రేట్లు తగ్గాల్సిన అవసరం ఉన్నదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పన్నుల రేట్లు తగ్గడం, పన్నుల పరిధిలోకి వచ్చేవారి సంఖ్య పెరగడం ద్వారా ప్రస్తుత పన్నుల విధానాన్ని.. రేట్ల నుంచి రెవిన్యూ దిశగా మార్చాలని సూచిస్తున్నారు. దీంతో దేశ పెట్టుబడులు, అభివృద్ధి అవసరాలకు కావాల్సిన నిధులను సృష్టించుకోవచ్చని చెప్తున్నారు. 'సంప్రదాయక అధిక పన్ను రేట్లు.. ప్రజల్లో పన్నులు చెల్లించాలన్న ఉత్సాహాన్ని నీరుగారుస్తాయి' అని ఈవై ఇండియా సీనియర్ భాగస్వామి సుధీర్ కపాడియా అన్నారు. పన్నుల రేట్లను తగ్గించి, సర్‌చార్జీలను, సెస్సులను, భారీ కోతలను తీసివేయాలని కూడా ఆయన తాజాగా చెప్పారు. 'భారత్.. ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే ఉన్నది. ఆదాయ పన్ను (ఐటీ) చెల్లింపుదారులు కొద్దిగానే ఉంటున్నారు. ఎందుకంటే తక్కువ తలసరి ఆదాయం. కాబట్టి ఇక్కడ అధిక పన్ను రేట్లు సరికాదు. పన్ను ఎగవేతలకు ఆస్కారం ఉంటుంది. పన్నులను తగ్గించుకోవడానికి ప్రజలు రకరకాల మార్గాలను అన్వేషిస్తూంటారు. దీనివల్ల దేశ జీడీపీ కూడా ప్రభావితమవుతుంది' అని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఎకనామిక్స్‌కు చెందిన నాయక్ అన్నారు. మొత్తానికి ప్రత్యక్ష, పరోక్ష పన్ను విధానాల్లో సంస్కరణలు రావాలని మెజారిటీ నిపుణులు అంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికిగాను వచ్చే నెల పూర్తిస్థాయి బడ్జెట్‌ను మోదీ సర్కారు తేనున్న క్రమంలో ఈ సూచనలు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి.